సాక్షి
పల్నాడు
మంగళవారం । 14 । మార్చి । 2023



గోవర్ధనోద్ధరణ అలంకారంలో నృసింహుడు

మంగళగిరి: లక్ష్మీనృసింహస్వామి వారు ఆస్థాన అలంకారోత్సవాలలో భాగంగా సోమవారం గోవర్ధనోద్ధరణ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.



అమ్మవారి ఆదాయం రూ. 36.20లక్షలు

దుర్గి: అడిగొప్పల నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి తిరునాళ్ల సందర్భంగా కానుకల రూపంలో రూ. 36,20,334 ఆదాయం వచ్చినట్లు ఈఓ నరసింహబాబు తెలిపారు.

నేడు కలెక్టరేట్‌లో నవోదయం

నరసరావుపేట: జిల్లాలో ఎస్సీ ఎస్టీల అభ్యున్నతి కోసం నిర్వహిస్తున్న నవోదయం కార్యక్రమం మంగళవారం ఉదయం 10 గంటలకు కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ అధ్యక్షతన జరగనుంది.



న్యూస్‌రీల్

రేపు బ్రూస్‌లీ కళారూపం ఆవిష్కరణ



ఏఎన్‌యూ: మార్షల్ ఆర్ట్స్ కళాకారుడు, సినీ నటుడు బ్రూస్‌లీ కళారూపం ఆవిష్కరణ బుధవారం యూనివర్సిటీలోని క్రీడామైదానంలో జరగనుంది. ప్రముఖ సినీ దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మ, ఏఎన్‌యూ వీసీ ఆచార్య పి.రాజశేఖర్‌లు ఈ కళారూపాన్ని ఆవిష్కరించనున్నారు. యూనివర్సిటీ ఫైన్‌ఆర్ట్స్ విభాగ అధ్యాపకుడు, కళాకారుడు పి.శ్రీనివాస్ నేతృత్వంలోని 10 మంది కళాకారుల బృందం 25 రోజులపాటు శ్రమించి ఈ కళారూపాన్ని తీర్చిదిద్దింది. 18 అడుగుల ఎత్తుతో ఏర్పాటైన బ్రూస్‌లీ రూపం సుమారు 2వేల కిలోల బరువు ఉంటుంది. పూర్తిగా వ్యర్థంగా పడవేసిన పాత పరికరాలతో రూపొందిస్తున్న ఈ కళారూపంలో 1600కు పైగా వెల్డింగ్ రాడ్స్‌తోపాటు గేర్‌బాక్స్‌లు, షాక్ అబ్జర్వర్స్ తదితర పాత ఇనుప వస్తువులను ఉపయోగించారు.

బల్లకట్టు నుంచి జారి నదిలో పడిపోయిన లారీ

త్రుటిలో తప్పిన ప్రమాదం



అచ్చంపేట: మండలంలోని మాదిపాడు కృష్ణానదిపై నడిచే బల్లకట్టుపై సోమవారం పన్నెండు టైర్ల లారీని ఎక్కించే సమయంలో త్రుటిలో ప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళితే తెలంగాణకు చెందిన ఒకరు అచ్చంపేట మండలంలో సెకండ్‌హ్యాండ్ లారీ కొనుగోలు చేసి బల్లకట్టు మీదుగా తీసుకెళ్లేందుకు ముందుగా లారీ వెనుకభాగాన్ని బల్లకట్టు మీద ఎక్కించి, తరువాత ముందుభాగాన్ని ఎక్కించే సమయంలో బల్లకట్టు నదిలోకి జరిగింది. దీంతో లారీ ముందుభాగం మొత్తం నీళ్లలో కూరుకుపోగా, బల్లకట్టు ఇసుకలో కూరుకుపోయింది. ఆ సమయంలో బల్లకట్టుపై సుమారు 60మంది వరకు ప్రయాణికులు, నాలుగు ఆటోలు, రెండు కార్లు ఉన్నాయి. అయితే హుటాహుటిన పొక్లెయిన్‌తో లారీని నదిలోనుంచి బయటకు లాగి, బల్లకట్టును సురక్షితంగా ఒడ్డుకు చేర్చడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగలేదు.

నులిపురుగుల నివారణను జయప్రదం చేయండి

నరసరావుపేట: జిల్లాలో 14వ తేదీ మంగళవారం నుంచి నిర్వహించే జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారులు, వైద్యశాఖ అధికారులు విజయవంతం చేయాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జి.శోభారాణి కోరారు. అన్ని విభాగాలు కలిసి జిల్లాలోని ఒకటి నుంచి 19 ఏళ్ల లోపు పిల్లలందరికీ 400 మిల్లీ గ్రాముల ఆల్బెండజోల్ మాత్రలను వేయించాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో చదువుతున్న 4,21,127 మంది పిల్లలకు మాత్రలు వేయించాలనే లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్దేశించిందన్నారు. వివిధ కారణాలతో 14వ తేదీన అందుబాటులో లేని విద్యార్థులకు 18వ తేదీన మాప్ అప్ డే రౌండ్ కింద మాత్రలు అందించడం జరుగుతుందన్నారు.

యార్డుకు 1,33,124 బస్తాల మిర్చి



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 1,33,124 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,22,580 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నెంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి రూ.23,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.26,500 వరకు పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.13,500 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 88,554 బస్తాల మిర్చి నిల్వ ఉంది.

జల జల జలపాతం

పల్నాట భూగర్భ జలసిరి

- ఐదేళ్ల క్రితం ఆందోళనకర స్థాయిలో నీటిమట్టాలు
- మూడేళ్లుగా మారిన పరిస్థితులు
- వర్షపాతం, నీటిపారుదల పెరుగుదలతో సమృద్ధిగా జలం
- గతంలో వెయ్యి అడుగులైనా కానరాని గంగ
- నేడు 130 అడుగులకే బయల్పడుతున్న నీటి జాడ
- ప్రభుత్వ నీటి నిల్వ చర్యలతో కానవస్తున్న సత్ఫలితాలు



కారంపూడిలోని పొలాలకు నీరు పెడుతున్న రైతులు (ఫైల్)

మండిన ఎండల్లో గుండెలపై కన్నీటి బొట్లు రాల్చిన రాళ్ల భూమి....నేడు వానమ్మ చల్లని స్పర్శతో చిరుదరహాసం చేస్తోంది...ఏటికేడు గుక్కెడు నీళ్లు లేక పొలమారిన భూమాత ..నేడు ఉబికి వస్తున్న నీటి ఊటను చూసి గొంతు తడుపుకుంటోంది.. వందల అడుగులు గునపాలతో కుళ్లబొడిచినా కానరాని జలరాశి నేడు పచ్చని పొలాలలో పరుగులు తీస్తోంది..రాళ్ల నేలలో వేదన నిండిన గుండెలతో ఆకాశం వైపు ఆశగా చూసిన అన్నదాతకు నేడు భూగర్భమే జలాభిషేకం చేస్తోంది.. మూడేళ్లుగా వాన చినుకు కరుణించగా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికగా గొడుగు పట్టి ప్రతి బొట్టును ఒడిసిపట్టింది.. ఇది ఫలితమిస్తూ భూగర్భ జలం పంట భూమికి పచ్చని చీర కడుతోంది.

– గుంటూరు డెస్క్

సంవత్సరం, భూగర్భ జలాల లభ్యత మీటర్లలో	
2018	10.18
2019	9.79
2020	7.64
2021	7.64
2022	7.58

రాతి నేల, సముద్ర మట్టానికి 150 మీటర్ల ఎత్తులో ఉండటంతో పల్నాడు ప్రాంతంలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. వర్షపాతం చాలా తక్కువ. దీనికితోడు నీటి పారుదల వనరులూ అంతంతమాత్రమే కావడంతో భూగర్భ జలాలు ఐదేళ్ల క్రితం అట్టడుగుకు చేరుకున్నాయి. గతంలో ఉమ్మడి గుంటూరు జిల్లా అంతటా ఒకే విధమైన వర్షపాతం నమోదైనా గుంటూరు, తెనాలి ప్రాంతాల్లో నల్లరేగడి, తేమ ఎక్కువగా ఉండే భూములు అధికం కావడంతో నీరు సులభంగా ఇంకి భూగర్భ జలాలు మెండుగా ఉండేవి. రాతి భూభాగం అధికంగా ఉన్న పల్నాడులో మాత్రం భూగర్భ నీటిమట్టాలు అట్టడుగునే ఉండేవి.

2018లో మరీ దారుణంగా..

పల్నాడులో 2018లో భూగర్భ జలాలు ప్రమాద స్థాయికి పడిపోయాయి. ఆ సంవత్సరం సగటున 10.18 మీటర్ల లోతుకు దిగజారాయి. ఫలితంగా మాచర్ల, దాచేపల్లి, వెల్దుర్తి, బొల్లాపల్లి, యడ్లపాడు మండలాల్లో తాగునీటికీ ప్రజలు అల్లాడారు.

వర్షపాతమూ అంతంతే..

ఉమ్మడి గుంటూరు జిల్లాలో గత 40 ఏళ్లలో కనిష్ట వర్షపాతం 2018–19 సంవత్సరంలోనే నమోదైంది. భూగర్భ జల విభాగం లెక్కల ప్రకారం 2018–19లో 396.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, 2016–17లో 756.6 మిల్లీమీటర్లు, 2017–18లో 654.2 మి.మీ. నమోదైంది.

ప్రభుత్వ చర్యలతో సత్ఫలితాలు..

అనూహ్యంగా మూడేళ్లుగా పల్నాడు జిల్లాలోని భూగర్భ జల మట్టాల్లో పెరుగుదల కనిపిస్తోంది. అధికారిక లెక్కల ప్రకారం 2019లో జిల్లావ్యాప్తంగా సగటున 9.79 మీటర్ల లోతున ఉన్న భూగర్భ జలాలు 2020లో 7.64 మీటర్లకు ఎగబాకాయి. 2021లో అవి మరింత పైకి వచ్చి 7.64 మీటర్లకు చేరుకున్నాయి. నీటి పారుదల పెరగడం, చెరువులు, కుంటల్లో నీరు నిల్వ చేయడం, ప్రభుత్వం నీటి నిల్వలపై ప్రత్యేక దృష్టిసారించడం వల్ల సత్ఫలితాలు వచ్చినట్టు అధికారులు చెబుతున్నారు. బొల్లాపల్లి, వెల్దుర్తి మండలాల్లో బోర్ల తవ్వకాలపై నిబంధనలు విధించి ప్రత్యామ్నాయ నీటి వనరులను అందుబాటులోకి తీసుకురావడమూ కలిసి వచ్చిందని పేర్కొంటున్నారు.

సామాజిక బాధ్యతగా భావించాలి..

భూగర్భ జలాల పరిరక్షణను అందరూ సామాజిక బాధ్యతగా గుర్తించాలి. ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలి. అధికారుల సూచనలు పాటించి సహకరిస్తే మరింత మంచి ఫలితాలు ఉంటాయి.

– యు.రాజశేఖర్, జిల్లా భూగర్భ జల విభాగం అధికారి, పల్నాడు

రాతి భూభాగం వల్లే..



పల్నాడులో రాతి భూభాగం అధికంగా ఉండటం వల్ల నీరు భూమిలోకి అంతగా ఇంకదు. అందువల్ల నీరు అడుగంటుతోంది. ఈ ప్రాంతంలో భూగర్భ జలాల పెరుగుదలకు మరిన్ని పటిష్ట చర్యలు అవసరం

– డాక్టర్ పీజే రత్నాకర్, భూగర్భ విజ్ఞానశాస్త్ర విభాగాధిపతి, ఏఎన్‌యూ

130 అడుగులకే నీరు పడుతుంది..



మాది పూర్తిగా మెట్ట ప్రాంతం. వ్యవసాయంపై ఆధారపడిన కుటుంబం. ఎక్కువగా మిర్చి పండిస్తాం. మా కుటుంబానికి 20 ఎకరం పొలం ఉంది. మూడు బోరుబావులున్నాయి. మూడు అంగుళాల సైజు నీళ్లతో పూర్తిగా 20 ఎకరాలకు నీటి వసతి కల్పిస్తున్నాం. గత నాలుగు సంవత్సరాల క్రితం సక్రమంగా వర్షాలు లేక కరువుతో ఇబ్బందులు పడ్డాం. అప్పట్లో మా గ్రామంలో 1,000 అడుగుల లోతు బోర్లు వేసినా నీళ్లు లభించలేదు. కానీ ప్రస్తుతం 130 నుంచి 150 అడుగులకే పుష్కలంగా నీరు లభిస్తోంది. గత నాలుగేళ్లుగా గ్రామంలో రైతులు వందకు పైగా బోర్లు తవ్వగా దాదాపుగా ప్రతిబోరులో నీరు పడటంతో మా గ్రామం అంతా సస్యశ్యామలంగా పంటలు పండిస్తున్నాం. గతంలో ఎకరం పొలం తడవటానికి పట్టే సమయంలో ప్రస్తుతం మూడో వంతు తక్కువ సమయం పడుతోంది.

– పుచ్చకాయల కొండలు, రైతు, తేరాల గ్రామం, దుర్గి మండలం

పంటల దిగుబడి పెరుగుతోంది...



నేను 5 ఎకరాల్లో మిర్చి, పత్తి పంటను సాగుచేస్తాను. గతంలో మిర్చి పంటకు సరిపడా నీటిని అందించలేని దుస్థితి. పంట పూర్తి అయ్యేలోపు 10–12 సార్లు పంటను తడిపేవాళ్లం. ఎకరానికి 25 నుంచి 30 క్వింటాళ్ల మిర్చి దిగుబడి వచ్చేది. గత మూడేళ్లుగా భూగర్భ జలాల మట్టం కాస్త ఆశాజనకంగా ఉండటంతో పంట పూర్తి అయ్యేలోపు 15 సార్లు పంటను తడపగలగుతున్నాం. దీంతో ఎకరానికి 30–35 క్వింటాళ్ల వరకు మిర్చి దిగుబడివస్తోంది.

– రావు ప్రసాదరావు, రైతు, రావులాపురం, బొల్లాపల్లి మండలం

ఒక్క మాత్రతో 'నులి'మేద్దాం

- నేడు జాతీయ నులిపురుగుల నిర్మూలన దినం
- ఉచితంగా ఆల్బెండజోల్ మాత్రలు
- జిల్లావ్యాప్తంగా 4,03,197 మంది విద్యార్థులకు పంపిణీ

గుంటూరు మెడికల్: చిన్నారుల జీవితాలను నులిపురుగులు నులిమేస్తున్నాయి. పిల్లల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తున్నాయి. పిల్లలో అనేక రకాల అనారోగ్యాలకు కారణమవుతున్న నులిపురుగులను కేవలం ఒకే మాత్ర 'ఆల్బెండజోల్'తో నివారించవచ్చు. ఈ నెల 14న జాతీయ నులిపురుగుల నిర్మూలన దినం సందర్భంగా ప్రత్యేక కథనం.

నులిపురుగులతో అనర్థాలు...

నులిపురుగులు చిన్నారుల్లో రక్తహీనతకు దారితీస్తాయి. శారీరక, మానసిక ఎదుగుదలకు ఆటంకంగా మారతాయి. కడుపు లోపల చేరి నొప్పి, మంట, వికారం కలుగచేస్తాయి. దీని వల్ల ఆహారం సహించదు. ఆకలి ఉండదు. పిల్లలు నీరసపడతారు. వ్యాధి నిరోధక శక్తి తగ్గుతుంది. శారీరక, మానసిక అభివృద్ధిలో మందకొడిగా ఉంటారు. పోషకాహారలోపం, రక్తహీనతతో ఎప్పుడూ అలసిపోతారు.



జాతీయ నులిపురుగుల నిర్మూలన పోస్టర్

అపరిశుభ్రతే కారణం...

అపరిశుభ్రత వల్లే నులిపురుగులు ఎక్కువగా వ్యాపిస్తాయి. పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించని పిల్లలకు నులిపురుగుల సమస్య ఎక్కువగా ఉంటుంది. పిల్లలు ఎప్పుడూ చేతిగోళ్లను శుభ్రంగా ఉంచుకోవాలి. గోళ్లు పెరిగినప్పుడు వెంటనే కత్తిరించుకోవాలి. లేకుంటే వాటిల్లో పేరుకున్న మట్టి ద్వారా నులిపురుగులు శరీరంలోకి ప్రవేశిస్తాయి. కలుషిత నీరు, బహిరంగ ప్రదేశాల్లో మలవిసర్జన వల్ల కూడా నులిపురుగులు మన శరీరంలోకి చేరతాయి.

ఇలా నివారించవచ్చు...

పిల్లలో మూడు రకాల పురుగులు ఉండే అవకాశం ఉంది. అవి ఏలికపాములు, నులిపురుగులు, కొంకి పురుగులు. వీటిని నిర్మూలించేందుకు ఆల్బెండజోల్ మాత్రలను తీసుకోవాలి. మాత్రను భోజనం తరువాత తీసుకోవాలి. మాత్ర వేసుకున్న ఒక రోజు లేదా రెండు రోజుల్లో నులిపురుగులు ఉన్నట్లయితే మలవిసర్జన ద్వారా బయటకు వెళ్తాయి.

మాత్రల డోస్ ఇలా...

జ్వరం, వాంతులు, విరోచనాలు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారికి, వ్యాధితో మంచానికి పరిమితమైన వారికి ఆల్బెండజోల్ మాత్రలు ఇవ్వకూడదు. ఏడాదిలోపు పిల్లలకు మాత్రలు ఇవ్వకూడదు. ఏడాది నుంచి రెండేళ్ల లోపు చిన్నారులకు ఆల్బెండజోల్ సగం మాత్ర ఇవ్వాలి. మాత్రను పొడిలా చేసి నీటిలో వేసి కరిగించి తాగించాలి. లేదా సిరప్‌ను 5 మిల్లీమీటర్లు ఇవ్వాలి.

ఆల్బెండజోల్‌తో అనేక ప్రయోజనాలు...



ఆల్బెండజోల్ మాత్రను పిల్లల చేత నమిలి మింగిచటం ద్వారా అనేక ప్రయోజనాలు కలుగుతాయి. మాత్ర తీసుకోవటం ద్వారా నులిపురుగులు నిర్మూలమవుతాయి. ఫలితంగా రక్తహీనతను నియంత్రించవచ్చు. వ్యాధి నిరోధకశక్తి మెరుగు పడుతుంది. పిల్లలు తీసుకునే ఆహారం వంటబడుతుంది. ఏకాగ్రత, నేర్చుకోగల సామర్థ్యం, పనిసామర్థ్యం పెరుగుతుంది.

– డాక్టర్ టి.చంద్రశేఖర్‌రెడ్డి, పిల్లల వైద్యనిపుణులు, గుంటూరు

నమిలి మింగేలా చూడాలి..



జిల్లా వ్యాప్తంగా కాలేజీలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక పాఠశాలలు, అప్పర్ ప్రైమరీ పాఠశాలలు, హైస్కూల్స్‌లో మొత్తం 4,03,195 మంది 19 ఏళ్ల లోపు పిల్లలు ఉన్నారు. వీరందరికి ఆల్బెండజోల్ మాత్రలను ఉచితంగా పంపిణీ చేశాం. పిల్లలంతా మాత్రలను నమిలి మింగేలా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉంది.

– డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు, డీఎంహెచ్‌ఓ గుంటూరు

సమస్యలపై సత్వర 'స్పందన' అవసరం

జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్

నరసరావుపేట: కలెక్టరేట్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్పందన హాలులో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ అధ్యక్షతన నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి పెద్దఎత్తున ప్రజలు తరలివచ్చి 108 వినతులను అందించారు. ప్రజల సమస్యలను విన్న జిల్లా కలెక్టర్ వాటిని సంబంధిత శాఖల అధికారులకు పంపి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్, పులిచింతల ప్రాజెక్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వసంతబాబు ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. స్పందన కార్యక్రమానికి వచ్చిన వారికి జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తరపున ఆత్మకూరు శ్రీనివాసరావు (గోల్డ్ శ్రీను) భోజన సదుపాయం కల్పించారు. దాత శ్రీనివాసరావును జిల్లా కలెక్టర్, జేసీలు ఘనంగా సత్కరించారు.

హాల్ టికెట్లు ఇవ్వకపోతే కఠిన చర్యలు

జిల్లాలో ఇంటర్, పదో తరగతి పరీక్షలకు విద్యార్థులు సన్నద్ధం అవుతున్న తరుణంలో ప్రైవేటు విద్యాసంస్థలు కొన్ని ఫీజులు పూర్తిగా చెల్లించలేదనే కారణం చూపుతూ హాల్ టికెట్‌లు ఇవ్వడం లేదన్న విషయం తన దృష్టికి వచ్చిందని, ఎవరైనా హాల్ టికెట్ ఇవ్వడానికి నిరాకరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ శివశంకర్ హెచ్చరించారు.

ప్రభుత్వ ఆస్తి అన్యాక్రాంతం కాకుండా ఆపండి..

స్థానిక స్టేషన్‌రోడ్డులోని గాంధీపార్క్ ఎదురుగా 1979లో ఏర్పాటుచేసిన తాలూకా గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం ఆధ్వర్యంలో నాలుగు కమర్షియల్ షాపులు, ఒక మీటింగ్ హాలు ఉన్నాయని, వాటిని కాకానికి చెందిన మాజీ గ్రామ పరిపాలన అధికారి ఎం.వెంకయ్యచౌదరి, రవీంద్ర రంగయ్యలు కోర్టు స్టేల ఆధారంతో గత కొంతకాలంగా ప్రభుత్వానికి చెల్లించాల్సిన అద్దెలను చెల్లించకుండా అక్రమంగా షాపులు నిర్వహిస్తున్నారని పట్టణానికి చెందిన బొగ్గరం మూర్తి జిల్లా కలెక్టర్‌కు అర్జీని అందజేశారు. దీనిపై సత్వరమే స్పందించిన కలెక్టర్ ప్రభుత్వానికి సంబంధించిన రాబడిని చెల్లించేవిధంగా, ప్రభుత్వ ఆస్తులను అన్యాక్రాంతం కాకుండా ఉండే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.



సమస్యలు ఆలకిస్తున్న జిల్లా కలెక్టర్ శివశంకర్

జగనన్న ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తిచేయండి..

నరసరావుపేట: పల్నాడు జిల్లాలో జగనన్న పేదలందరికీ ఇళ్లు పథకం ద్వారా నిర్మిస్తున్న గృహ నిర్మాణాల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గృహ నిర్మాణ శాఖ, మండల పరిషత్, గ్రామీణ నీటి సరఫరా విభాగం, పంచాయతీరాజ్, పట్టణ పేదరిక నిర్మూలన శాఖ (మెప్మా), జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ (వెలుగు), అధికారులు, మున్సిపల్ కమిషనర్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జగనన్న కాలనీలే అవుట్‌లలో గృహ నిర్మాణాల ప్రగతిని జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకొని సొంతగా గృహాలను నిర్మించుకుంటున్న లబ్ధిదారుల పరిస్థితిపై ఆరా తీశారు.

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

రేపటి నుంచి ప్రారంభం

- ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా 134 కేంద్రాలు
- హాజరుకానున్న 98,682 మంది విద్యార్థులు
- హాల్ టికెట్లు ఇవ్వని యాజమాన్యాలపై కఠిన చర్యలు
- ఇంటర్మీడియెట్ విద్య ఆర్‌ఐఓ గర్నెపూడి సునీత

గుంటూరు ఎడ్యుకేషన్: బుధవారం నుంచి జరగనున్న ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆర్‌ఐఓ గర్నెపూడి సునీత చెప్పారు. సాంబశివపేటలోని ఇంటర్మీడియెట్ విద్య ఆర్‌ఐఓ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఏర్పాటు చేసిన 134 పరీక్షా కేంద్రాల పరిధిలో 98,682 మంది విద్యార్థులు హాజరు కానున్నారని చెప్పారు. వీరిలో ప్రథమ సంవత్సరం 49,228 మంది విద్యార్థులతో పాటు ద్వితీయ సంవత్సర విద్యార్థులు 49,454 మంది ఉన్నారని వివరించారు. గుంటూరు జిల్లా పరిధిలోని 73 కేంద్రాల్లో 58,602 మంది, పల్నాడు జిల్లాలో 44 కేంద్రాల పరిధిలో 30,530, బాపట్ల జిల్లాలో 17 కేంద్రాల్లో 9,550 మంది చొప్పున విద్యార్థులు హాజరు కానున్నట్లు తెలిపారు.



ఉదయం 9 తరువాత నో ఎంట్రీ..

ఇంటర్ పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరగనుండగా, విద్యార్థులను 8.30 నుంచి కేంద్రాల్లోకి అనుమతిస్తామని చెప్పారు. ఉదయం 9 గంటల తరువాత పరీక్ష కేంద్రాల గేట్లను మూసివేయిస్తామని, నిమిషం ఆలస్యమైనా అనుమతించేది లేదన్నారు. విద్యార్థులు ముందు రోజే పరీక్ష కేంద్రాన్ని స్వయంగా చూసి రావాలన్నారు. కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులకు హాల్ టికెట్లు ఇవ్వాలని, ఫీజు బకాయిల పేరుతో హాల్ టికెట్లు ఇచ్చేందుకు నిరాకరించిన పక్షంలో ప్రిన్సిపాల్స్‌పై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా ఇంటర్ పరీక్ష కేంద్రాలను ప్రభుత్వం మొబైల్ ఫ్రీ జోన్లుగా ప్రకటించామని, పరీక్ష కేంద్రాల్లో విద్యార్థుల హాజరు, ప్రశ్నాపత్రాల్లో తేడాలుంటే వాటిని ఉన్నతాధికారుల దృష్టికి తెచ్చేందుకు చీఫ్ సూపరింటెండెంట్ వద్ద మాత్రం బోర్డు అందజేసిన ప్రత్యేక సిమ్‌తో బేసిక్ ఫోన్ ఉదయం 9.30 నుంచి 10.15 వరకు ఉంటుందని చెప్పారు. విద్యార్థులు హాల్ టికెట్, పరీక్ష ప్యాడ్, పెన్ను మినహా సెల్‌ఫోన్లతో సహా ఇతర ఎటువంటి సామగ్రి తమ వెంట తీసుకు రాకూడదని స్పష్టం చేశారు.

బుక్‌లెట్‌లో పేజీలను చింపితే మాల్ ప్రాక్టీసే..

విద్యార్థులకు అందజేసే ఓఎంఆర్ షీట్‌తో పాటు 24 పేజీలతో కూడిన ఆన్సర్ బుక్‌లెట్‌లో ఏ ఒక్క పేజీని చింపరాదని, ఆ విధంగా పేజీలను చింపితే మాల్ ప్రాక్టీసు కింద పరిగణిస్తామని ఆర్‌ఐఓ సునీత స్పష్టం చేశారు. పరీక్ష కేంద్రాల సమీపంలో జిరాక్స్ కేంద్రాలను మూసి వేయాలని, అన్ని పరీక్ష కేంద్రాల వద్ద పోలీసుశాఖ 144 సెక్షన్ అమలు పరుస్తోందని చెప్పారు. పరీక్ష కేంద్రాలన్నింటిలో సీసీ కెమెరాలతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని, ఇంటర్‌బోర్డు నుంచి ఉన్నతాధికారులు లైవ్ స్ట్రీమింగ్ విధానంలో ప్రత్యక్షంగా పరిశీలిస్తారని చెప్పారు. పరీక్ష కేంద్రాల్లో మాల్ ప్రాక్టీసుల నిరోధానికి బోర్డు నుంచి ఐదు ఫ్లయింగ్ స్క్వాడ్, తొమ్మిది సిట్టింగ్ స్క్వాడ్ బృందాలతో పాటు మూడు జిల్లాల కలెక్టర్ల సారథ్యంలో తహసీల్దార్‌లతో ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందాలు పరీక్ష కేంద్రాల్లో విస్తృత తనిఖీలు నిర్వహిస్తారని చెప్పారు. హాల్ టికెట్లు ఇవ్వకపోయినా, పరీక్షలకు సంబంధించిన ఇతర ఏదైనా సమస్యలున్నట్లయితే గుంటూరు ఆర్‌ఐఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ (0863–2228528, 2221544) నంబర్ల దృష్టికి తీసుకు రావాలని సూచించారు. సమావేశంలో డీఈసీ సభ్యులు టి.శేఖర్‌బాబు, జి.బాలమోహన్ రావు, పి.సుధాకర్, పాండురంగారావు పాల్గొన్నారు.

గుంటూరులో పరీక్ష కేంద్రం చిరునామా మార్పు

–06123 కోడ్ నంబరుతో గుంటూరు శివారు చల్లావారిపాలెం చిరునామాతో ఏర్పాటు చేసిన నారాయణ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రం పెదపలకలూరురోడ్డులోని రత్నగిరినగర్‌కు మారిందని, మారిన చిరునామాతో కొత్తగా హాల్ టికెట్లను విద్యార్థులకు అందజేసినట్లు తెలిపారు. సంబంధిత కోడ్‌తో హాల్ టికెట్లు పొందిన విద్యార్థులందరు పరీక్ష కేంద్రం చిరునామా మార్పును గమనించాలని ఆర్‌ఐఓ సునీత సూచించారు.

నా తమ్ముడి కొడుకులు మోసగించారు..

జిల్లా ఎస్పీ స్పందనలో వృద్ధురాలి ఫిర్యాదు


యంపరాల గంగమ్మ, కోమటినేనివారిపాలెం

నరసరావుపేట: స్థానిక ఎస్పీ కార్యాలయంలో స్పందన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి బాధితులు ఫిర్యాదు చేసేందుకు వచ్చారు. జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి ఆదేశాల మేరకు అధికారులు అర్జీలు స్వీకరించారు.
–తనకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారని, పుట్టిల్లు కట్టుబడివారిపాలెంలో నాలుగు సెంట్ల స్థలంలో ఇల్లు ఉందని కోమటినేనివారిపాలేనికి చెందిన యంపరాల గంగమ్మ పేర్కొంది. గ్రామ వీఆర్వోను అడ్డుపెట్టుకొని ఇంటిపన్ను రసీదు ఆధారంగా తన ఇంటిని తన తమ్ముడి కుమారులు రిజిస్ట్రార్ చేసుకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయం రెండు నెలల తర్వాత తెలిసిందని, రిజిస్ట్రేషన్ రద్దు చేసి మోసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని అర్జీలో కోరారు.


స్పందనకు వచ్చిన ప్రజల సమస్యలు తెలుసుకొని వారికి ఫిర్యాదులు రాసిస్తున్న పోలీసులు

ఆర్‌ఆర్‌ఆర్‌కు ఎమ్మెల్యే పీఆర్కే అభినందనలు



మాచర్ల: ఆస్కార్ అవార్డు అందుకున్న ఆర్‌ఆర్‌ఆర్ టీమ్‌కు పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి(పీఆర్కే) సోమవారం ఒక ప్రకటనలో అభినందనలు తెలిపారు. రాజమౌళి, చంద్రబోస్, కీరవాణి, జూనియర్ ఎన్టీఆర్, రామచరణ్‌తో పాటు ఆర్‌ఆర్‌ఆర్ చిత్రయూనిట్‌కు శుభాకాంక్షలు చెప్పారు. దేశ చరిత్రలోనే ఒక ఒరిజినల్ సాంగ్‌ను ఆస్కార్ పురస్కారానికి ఎంపిక కావటం సంతోషకరమని పేర్కొన్నారు. తెలుగు ప్రజలకు గర్వకారణంగా పేర్కొన్నారు. ఇది తెలుగు ప్రజలు సంబరాలు చేసుకునే సమయమని చెప్పారు. తెలుగు సినిమా చరిత్రలో గొప్పమలుపుగా పేర్కొన్నారు. మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

భక్తిశ్రద్ధలతో కుంకుమ బండ్ల ఊరేగింపు


అమ్మవారి పల్లకి సేవలో పాల్గొన్న జిల్లా అధికారి సత్యనారాయణరెడ్డి, ఈఓ


ఆలయం చుట్టూ కుంకుమ బండిని ఊరేగింపు చేస్తున్న దృశ్యం

దుర్గి: నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి తిరునాళ్ల మహోత్సవం ఘనంగా సోమవారం ముగిసింది. ఆదివారం ఉదయం వేకువజాము నుంచి లక్షలాది మంది భక్తులు తరలిరావటంతో పరిసర ప్రాంతం ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. భక్తి పారవశ్యంతో భక్తులు తమ ఇలవేల్పు శ్రీలక్ష్మీ అమ్మవారికి తమ మొక్కులు చెల్లించుకొని దర్శనాలు చేసుకున్నారు.
రాత్రి బయలుదేరిన కుంకుమబండ్లు సోమవారం ఉదయం 4గంటలకు అమ్మవారి ఆలయ ప్రాంగణానికి చేరుకొని భక్తిని చాటుకున్నారు. తిరిగి సోమవారం సాయంత్రం 4గంటలకు ఆయా గ్రామాలకు కుంకుమ బండ్లు చేరాయి. గ్రామాలలోని వీధులలో తమ కుంకుమబండ్లను ఊరేగింపు చేశారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఎప్పటికప్పుడు ఏర్పాట్లపై ఆరా తీశారు. ఆలయ అధికారి శ్రీగిరిరాజు నర్సింహబాబు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

గంజాయి చాక్లెట్ల విక్రయంపై విస్తృత తనిఖీలు

నాదెండ్ల: పారిశ్రామిక కేంద్రం గణపవరంలో గుట్టుచప్పుడు కాకుండా లిక్విడ్ గంజాయి చాక్లెట్ల విక్రయంపై 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి పోలీసులు స్పందించారు. ఎస్‌ఐ ఆవుల భాస్కర్ సిబ్బందితో కలసి సోమవారం గణపవరంలోని బిహార్, ఒడిశా, ఉత్తరాంధ్ర కార్మికులు నివాసం ఉండే ప్రాంతాల్లోని బడ్డీ కొట్లను తనిఖీ చేశారు. అయితే ఎక్కడా ఈ చాక్లెట్లు ఆచూకీ కనిపించలేదు. వ్యాపారులు గుట్టుచప్పుడు కాకుండా చేతుల మీదుగానే అమ్ముతున్నట్లు గుర్తించారు. బడ్డీకొట్లతో పాటూ వివిధ పరిశ్రమల పరిసరాల్లో తనిఖీలు చేశారు. మత్తు పదార్థమైన బాగ్పిని చాక్లెట్లుగా విక్రయిస్తున్నట్లు తేలింది. ఇలాంటి మత్తు పదార్థాలను విక్రయించినా, వినియోగించినా చట్టప్రకారం చర్యలు తప్పవన్నారు. గుట్కా, పాన్‌పరాగ్, హెరాయిన్, నల్లమందు, గంజాయి, బాగ్పి వంటి వాటిని విక్రయించే వారిపై రౌడీషీట్ తెరుస్తామని హెచ్చరించారు.


బడ్డీ దుకాణంలో తనిఖీలు చేస్తున్న ఎస్‌ఐ భాస్కర్

గురుకులాల్లో కార్పొరేట్‌కు దీటుగా సదుపాయాలు

కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి

తాడికొండ: గురుకుల పాఠశాలల్లో ప్రభుత్వం కార్పొరేట్ స్థాయి మౌలిక సౌకర్యాలతో పాటు అత్యున్నత ప్రమాణాలతో విద్యాబోధన చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి అన్నారు. సోమవారం తాడికొండ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో క్రీడా పరికరాల పంపిణీ చేశారు. అసిస్టెంట్ కలెక్టర్ శివన్నారాయణ శర్మతో కలసి ఆర్వో ప్లాంట్, వాలీబాల్, కబడ్డీ కోర్టులను ప్రారంభించారు. మరుగుదొడ్లలో రన్నింగ్ వాటర్ అందించేందుకు మంజూరు చేసిన పనులను వెంటనే పూర్తి చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూచించి, క్రీడల కోసం సిద్ధం చేసిన గ్రౌండ్‌లో విద్యార్థులు ఆడుకోవడానికి వీలుగా మరో లేయర్ మెత్తని ఎర్ర మట్టితో చదును చేయించాలని సూచించారు. విద్యార్థులతో అరగంట పాటు మమేకమైన జిల్లా కలెక్టర్ యూనిఫాం, పుస్తకాలు, ట్యాబ్‌ల వినియోగం, అమ్మ ఒడి పథకం, మౌలిక వసతులు, పలు విషయాలపై చర్చించారు. గతంలో తాను గురుకుల పాఠశాలను సందర్శించినప్పుడు నీటి కొరత, క్రీడా ప్రాంగణం లేదని విద్యార్థులు ఆయన దృష్టికి తీసుకురావడంతో రూ.25 లక్షలతో పైపు లైను నిర్మాణం చేయడంతో పాటు ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటు చేసి, క్రీడా ప్రాంగణం సిద్ధం చేసినట్లు తెలిపారు. జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్రీడా పరికరాలు అందిస్తున్నామని, ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు కష్టపడి చదవాలని సూచించారు. ఈ సందర్భంగా తాడికొండ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలతో పాటు అడవి తక్కెళ్లపాడు, కాకుమాను గురుకులాలకు చెందిన విద్యార్థులకు పలు క్రీడా పరికరాలను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచి తోకల సరోజినీ, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు మధుసూదనరావు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శారద, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ సీఈఓ పల్లవి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ సురేష్, తహసీల్దార్ ఫణీంద్రబాబు, ఇన్‌చార్జి ఎంపీడీఓ మహేష్ బాబు, ప్రిన్సిపాల్ ఎంబీడీ శ్యామల పాల్గొన్నారు.


విద్యార్థులకు క్రీడా పరికరాలు అందజేస్తున్న కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి

డీఈఓగా ఏడీకి అదనపు బాధ్యతలు

నరసరావుపేట ఈస్ట్: పల్నాడు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో ఏడీగా విధులు నిర్వహిస్తున్న ఎం.వెంకటేశ్వర్లుకు డీఈఓగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఇక్కడ పనిచేసిన డీఈఓపై ఆరోపణలు రాడంతో బాధ్యతల నుంచి తప్పించిన విషయం తెలిసిందే. త్వరలో పదో తరగతి పరీక్షలు జరుగనున్న నేపథ్యంలో నూతన డీఈఓను ప్రభుత్వం నియమించే వరకు వెంకటేశ్వర్లు డీఈఓగా బాధ్యతలు నిర్వహించనున్నారు.

నిబంధనల మేరకే వైద్య పరికరాలు కొనుగోలు

సీఎంఈ డాక్టర్ వినోద్‌కుమార్

గుంటూరు మెడికల్: గుంటూరు వైద్య కళాశాలలో నేషనల్ మెడికల్ కౌన్సిల్(ఎన్‌ఎంసీ) నిబంధనల ప్రకారం పీజీ సీట్లకు అవసరమైన మేరకు వైద్య పరికరాలు కొనుగోలు చేయాలని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) డాక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. స్థానిక వైద్య కళాశాలలో వైద్య కళాశాల అభివృద్ధి కమిటీ సమావేశం డీఎంఈ అధ్యక్షతన సోమవారం రాత్రి నిర్వహించారు. తొలుత వైద్య కళాశాలలోని అన్ని వైద్య విభాగాలను డీఎంఈ డాక్టర్ వినోద్‌కుమార్ పరిశీలించారు. ప్రతి విభాగంలో ఉన్న వైద్య పరికరాల పనితీరు గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రిన్సిపాల్ చాంబర్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైద్య పరికరాల కొనుగోలుతో ప్రాధాన్య క్రమంలో కొనుగోలు చేయాలని కోరారు. క్రిటికల్, జనరల్, నార్మల్ విభాగాల వారీగా, క్లినికల్, నాన్ క్లీనికల్ కేటగిరిలుగా, పేషెంట్ కేర్, మెడికల్ ఎడ్యుకేషన్ విభాగాలుగా కేటాయించి కొనుగోలు చేయాలని చెప్పారు. నాడు- నేడు పనుల్లో భాగంగా ఫిజియాలజీ వైద్య విభాగాన్ని కూలగొట్టి నూతన భవనం నిర్మించేందుకు గతంలో చేసిన ప్రతిపాదనను డీఎంఈ వద్దని చెప్పారు. సుమారు వందేళ్ల చరిత్ర ఉన్న ఫిజియాలజీ భవనం పడగొట్టకుండా వేరే స్థలంలో నాడు- నేడు పనుల్లో భాగంగా నూతన భవనం చేపట్టాలని సూచించారు. సీడీఎస్ నిధులు ఏవిధంగా వినియోగించాలనే విషయంపై విభాగాల వారీగా అన్ని వైద్య విభాగాధిపతులతో చర్చించారు. వారం రోజుల్లో వైద్య పరికరాల కొనుగోలుకు నివేదిక సిద్ధం చేసుకోవాలని చెప్పారు. అనంతరం మెన్స్ హాస్టల్ భవనాన్ని పరిశీలించి విద్యార్థులతో కలసి వసతి గృహంలో భోజనం చేశారు. కార్యక్రమంలో మాజీ డీఎంఈ డాక్టర్ రాఘవేంద్రరావు, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చాగంటి పద్మావతి దేవి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఉమాజ్యోతి, డాక్టర్ చంద్రకళ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డాక్టర్ వినోద్‌కుమార్, పక్కన డాక్టర్ పద్మావతి దేవి

లబ్ధిదారుడికి టిప్పర్ అందజేత

నరసరావుపేట: జిల్లాలో పేదల జీవన విధానంలో మార్పు కోసం ప్రభుత్వం ప్రయత్నిస్తోందని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ ఆవరణలో ప్రభుత్వ సహకారంతో జగనన్న బడుగు వికాసం ద్వారా జిల్లాలోని వెల్దుర్తి మండలం గుండాలపాడు గ్రామానికి చెందిన కంభంపాటి బాలయ్యకు మంజూరైన రూ.54 లక్షల విలువ చేసే టిప్పర్ వాహనాన్ని అందజేశారు. జాయింట్ కలెక్టర్ ఏ శ్యామ్‌ప్రసాద్‌తో కలిసి కొబ్బరికాయ కొట్టి వాహనాన్ని ప్రారంభించారు. గత నెల ఫిబ్రవరిలో నిర్వహించిన నవోదయం కార్యక్రమంలో జగనన్న బడుగు వికాసం పథకం ద్వారా వాహనం కోసం బాలయ్య దరఖాస్తు చేసుకున్నాడు. కలెక్టర్ ఆదేశాల మేరకు బ్యాంకు లబ్ధిదారునికి రుణం మంజూరు చేసింది. దీనితో ప్రభుత్వ సబ్సిడీ 45 శాతం లబ్ధిదారునికి లభించనుందని నవోదయం నోడల్ అధికారి సంజీవరావు తెలిపారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ అధికారి ఓబులు నాయుడు, జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ వెంకటేశ్వర్లు, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి వెంకటేశ్వరరావు, నవోదయం నోడల్ అధికారి సంగీతరావు పాల్గొన్నారు.


లబ్ధిదారునికి టిప్పర్ వాహనం అందజేస్తున్న జిల్లా కలెక్టర్ శివశంకర్, జేసీ శ్యామ్‌ప్రసాద్

బ్రాహ్మణ సేవా సమితి జిల్లా అధ్యక్షుడిగా లక్ష్మీపతి



గుంటూరు మెడికల్: బ్రాహ్మణ సేవా సమితి జిల్లా అధ్యక్షుడిగా ఆర్.లక్ష్మీపతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బ్రాడీపేటలోని బ్రాహ్మణ సేవా సమితి కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన్ను 2023–24 సంవత్సరానికి రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా తుళ్లూరు ప్రకాష్, కోశాధికారిగా కర్లపాలెం బాలకృష్ణ, ఉపాధ్యక్షులుగా ఆదిరాజు శ్రీధర్, గొల్లపూడి రామకృష్ణారావు, సంయుక్త కార్యదర్శులుగా వేదాంతం వినోద్ కిరణ్, పాతూరి త్రినాథ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా లక్ష్మీపతి మాట్లాడుతూ రాబోయే కాలంలో విద్యార్థినులకు వసతి సముదాయాన్ని దాతల సహకారంతో నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. ప్రతి ఏడాది సామూహిక ఉపనయనాలు, అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు వెల్లడించారు.

వైఎస్సార్ సీపీలో టీడీపీ నాయకుల చేరిక

రేపల్లె: రాష్ట్రంలో అవినీతికి తావులేకుండా అమలవుతున్న ప్రజాసంక్షేమ పథకాలతో ప్రతిపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలు ఆకర్షితులై తమ పార్టీలో చేరుతుండటం అభినందనీయమని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. రేపల్లె మండలం రాజుకాల్వ పంచాయతీ పరిధిలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన టీడీపీ కుటుంబాల సభ్యులు సోమవారం మోపిదేవి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ఆ గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు ఓలేటి గంగాధర్ ఆధ్వర్యంలో పార్టీలో చేరిన 30 కుటుంబాల వారికి మోపిదేవి వెంకట రమణారావు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గాదె వెంకయ్య బాబు, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి గరికపాటి భానుకోటి, సర్పంచ్ తలశిల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు

అమెరికాలో ఇంటర్న్‌షిప్‌కు విజ్ఞాన్ ఫార్మసీ విద్యార్థులు



చేబ్రోలు: మండలంలోని వడ్లమూడి విజ్ఞాన్ ఫార్మసీ కళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు అమెరికాలోని ప్రముఖ అడ్వాన్స్‌డ్ ఫార్మసీ హాస్పిటల్స్‌లలో ఇంటర్న్‌షిప్‌కు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.శ్రీనివాసబాబు సోమవారం తెలిపారు. ఫార్మా–డీకు చెందిన 6వ సంవత్సరం ముగ్గురు విద్యార్థులు ప్రశాంత్ బాబు, నాగేంద్ర, హారికలు అమెరికాలోని ప్రముఖ హాస్పిటల్స్‌లలో ఈ నెల 20 నుంచి వచ్చే నెల ఏప్రిల్ 21 వరకు జరిగే 4 వారాల అడ్వాన్స్‌డ్ ఫార్మసీ ప్రాక్టీస్ ఎక్స్‌పెరిమెంటల్ ట్రైనింగ్ ఇంటర్న్‌షిప్‌కు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ ముగ్గురు విద్యార్థులు ఏప్రిల్ 13, 14 తేదీలలో ఓహియోలోని యూనివర్సిటీ ఆఫ్ ఫిండ్లేలో జరగనున్న 5వ సంవత్సరం ఫార్మా–డీ సింపోసిజమ్ ఫర్ స్కాలర్‌షిప్ అండ్ క్రియేటివిటీ కాన్ఫరెన్స్‌లో తమ రీసెర్చ్ ప్రాజెక్టులను ప్రజెంట్ చేయడానికి కూడా ఎంపికైనట్లు వివరించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్, వైస్ చైర్మన్‌లు లావు రత్తయ్య, శ్రీకృష్ణదేవరాయలు అభినందించారు.

దొంగ ఓటుపై కేసు నమోదు

పర్చూరు: పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో సోమవారం పట్టభద్రుల ఎమ్మెల్సీకి సంబంధించి దొంగ ఓటు వేయడానికి వెళ్లిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఎన్.చెంచుప్రసాద్ తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల మేరకు.. తిమ్మరాజుపాలెం గ్రామానికి చెందిన చింతల సురేష్ పర్చూరు యూపీ స్కూల్‌లో ఏర్పాటు చేసిన పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రం 109లో దొంగ ఓటు వేయడానికి ప్రయత్నించాడు. విధుల్లో ఉన్న వీఆర్వో వలి పట్టుకొని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. చింతల సురేష్ అదే గ్రామానికి చెందిన నిడమానూరి నజీర్ ఓటును వేయడానికి ప్రయత్నించాడని పేర్కొన్నారు. నజీర్ హైదరాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడని, అతని ఆధార్ కార్డులో ఫొటో తొలగించి చింతల సురేష్ ఆ ఆధార్ కార్డుపై దొంగ ఓటు వేయడానికి ప్రయత్నించాడని వివరించారు. వీఆర్వో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

క్రైం కార్నర్

నలుగురు బైక్‌దొంగల అరెస్ట్

వివరాలు వెల్లడించిన డీఎస్పీ స్రవంతిరాయ్

కొల్లిపర: జిల్లాలో వివిధ ప్రాంతాల్లో బైక్ చోరీలకు పాల్పడుతున్న నలుగురు దొంగలను అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ డాక్టర్ స్రవంతిరాయ్ తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కొల్లిపర గ్రామానికి చెందిన బనరావూరి కోటేశ్వరరావు(కోటి) బ్యాండ్ మేళం టీమ్‌లో పనిచేస్తుంటాడు. ఈ నేపథ్యంలో మంగళగిరిలో బ్యాండ్ మేళాలకు వస్తున్న గరిక యేసుబాబుతో పరిచయం పెరిగింది. అతడి సేహ్నితులు గరిక ప్రసాద్, గరిక దుర్గారావు బృందంగా ఏర్పాడి జల్సా చేస్తున్నారు. దీంతో ఖర్చుల కోసం కూలీ డబ్బులు సరిపోక బైకు దొంగతనాలకు అలవాటు పడ్డారు. కృష్ణా జిల్లా పరిధిలో 3, గుంటూరు జిల్లా పరిధిలో 2, బాపట్ల జిల్లా పరిధిలో 3, ఇతర ప్రాంతాల్లో 14 బైక్‌లను దొంగలించారు. మొత్తం 22 బైకులు పోలీసులు వీరి వద్ద నుంచి స్వాధీనం చేసుకున్నారు. దొంగలించిన 22 బైకుల విలువ సుమారు రూ.15.20 లక్షలు ఉన్నట్లు తెలిపారు. వీటిలో 8 గురు బాధితులు ఆయా పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా 8చోట్ల కేసు నమోదు చేశారు. మిగిలిన 14 మోటార్ బైక్‌లకు నంబరు ప్లేట్లు లేనందున సదరు మోటార్ సైకిళ్లు పోగొట్టుకున్న బాధితులు కొల్లిపర పోలీస్ సేష్టన్ కు తమ వద్ద ఉన్న ధ్రువపత్రాలు తీసుకొని పరిశీలించుకోవాలని సూచించారు. మున్నంగి గ్రామం కృష్ణానది కరకట్టపై వాహనాలు తనిఖీ చేస్తుండగా ఎస్‌ఐ ఆర్.రవీంద్రరెడ్డి, సిబ్బందికి అనుమానితుల వివరాలు తెలిశాయి. వారిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా బైక్‌ల దొంగతనాలు వెలుగు చూడడంతో వాటిని గుర్తించి స్వాధీనపర్చుకున్నారు. కేసును ఛేదించిన ఎస్.రవీంద్రరెడ్డితో పాటు సిబ్బంది అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఎ.పోతురాజు, హెడ్ కానిస్టేబుల్ డి.శ్యామ్‌కుమార్, హెడ్ కానిస్టేబుల్ బి.తాతారావు, కానిస్టేబుళ్లు ఎం.కుర్మారావు, వై.సాంబయ్య, కె.విజయశేఖర్లను ఆమె ప్రత్యేకంగా అభినందించారు.


వివరాలు వెల్లడిస్తున్న తెనాలి డీఎస్పీ స్రవంతిరాయ్, పక్కన ఎస్‌ఐ రవీంద్రరెడ్డి

ఎలుకల మందు తిని విద్యార్థిని ఆత్మహత్య


మృతిచెందిన సయ్యద్ ముస్కాన్

పెదకాకాని: కుటుంబసభ్యులను బెదిరించే క్రమంలో పరిస్థితి విషమించి యువతి మృతి చెందిన సంఘటన పెదకాకానిలో చోటు చేసుకుంది. పెదకాకాని స్వర్ణపురి కాలనీకి చెందిన సయ్యద్ ముంతాజ్ దంపతులకు ముగ్గురు కుమార్తెలు. వారిలో రెండవ అమ్మాయి సయ్యద్ ముస్కాన్(17) ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం చదువుతుంది. ఈ నెల 8వ తేదిన ఇంటిలో పనులు చేసుకునే విషయంలో కుటుంబసభ్యులతో గొడవ పడింది. క్షణికావేశంలో కుటుంబసభ్యులను బెదిరించేందుకు ఎలుకల మందు(ఎలుకల నివారణకు ఉపయోగించే పేస్టు) కూల్‌డ్రింక్‌లో కలుపుకొని తాగింది. 9వ తేదీ ఉదయం వాంతులు చేసుకుంటున్న కుమార్తెను తల్లి గమనించిన అడిగింది. అక్క, చెల్లిని బెదిరించేందుకు ఎలుకల మందు తిన్నానని పేర్కొంది. వెంటనే కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న సయ్యద్ ముస్కాన్(17) పరిస్థితి విషమించి ఆదివారం రాత్రి మరణించింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బండారు సురేష్‌బాబు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.